Office Of The Advisor (communications)
Govt. Of Andhra Pradesh

# నెలాఖరున మార్కెట్‌లో

# ‘అమరావతి బాండ్లు’

## వచ్చే నెల మొదటివారంలో ‘డెవలపర్స్ కాంక్లేవ్’

## బెజవాడలో సత్వరం కాలువల సుందరీకరణ

## శనివారం అమరావతిలో ముఖ్యమంత్రి ‘పనుల’ పరిశీలన

అమరావతి, మే 18 : రాజధాని నిర్మాణం కోసం ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్న రూ.2 వేల కోట్ల విలువ చేసే ‘అమరావతి బాండ్లు’ ఈ నెలాఖరు నాటికి మార్కెట్‌లో విడుదల కానున్నాయి. ఈనెల 22 నాటికి వీటికి సంబంధించిన క్రెడిట్ రేటింగ్ ప్రక్రియ పూర్తవుతుందని, మరుసటి రోజు ప్రభుత్వ అనుమతులు తీసుకుని నెలాఖరులోగా మార్కెట్‌లోకి తీసుకు రానున్నారు. రాజధాని అభివృద్ధి పనుల పురోగతిపై శుక్రవారం ఉదయం జరిగిన సమీక్షా సమావేశంలో ఈ బాండ్లకు సంబంధించిన వివరాలను సీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ బాండ్లకు ఎ, ఎ ప్లస్, ఎఎ కేటగిరిల్లో క్రెడిట్ రేటింగ్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అమరావతిలో వివిధ ప్రాజెక్టులు చేపట్టిన కాంట్రాక్టర్ల చెల్లింపు అవసరాలకు, ఇతర అభివృద్ధి పనులకు ఈ బాండ్లు అక్కరకొస్తాయని భావిస్తున్నట్టు తెలిపారు.

రాజధాని నిర్మాణానికి అవసరమైన నిధుల్లో ప్రాథమికంగా రూ.2వేల కోట్ల మేరకు వివిధ బాండ్ల ద్వారా సమీకరించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బాండ్లకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీగా ఉంటుంది. ఈ జారీచేస్తున్న బాండ్లతో పాటు ప్రవాసుల కోసం ప్రత్యేకంగా ‘అమరావతి బాండ్లు’ తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాజధాని నిర్మాణం కోసం ఎంతోమంది ముందుకొచ్చి ప్రతి రోజూ తనకు విరాళాలు అందిస్తున్నారని, ఈ నిధుల సేకరణను సక్రమంగా

నిర్వహించడానికి ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నరసయ్య అనే వ్యక్తి ఆస్పత్రి నుంచి డిశ్చార్జయి నేరుగా తన దగ్గరకు వచ్చి రాజధాని నిర్మాణం కోసం చెక్ ఇచ్చి వెళ్లాడని, మరొకరు తన రెండు నెలల పింఛను అందించారని, ఒక ప్రవాస మహిళ తనకోసం చాలా సేపు వేచి వుండి రూ.10 లక్షలు చెక్ ఇచ్చి వెళ్లారని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు.

కొత్త నగరంలో సామాజిక మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ముందస్తు వ్యూహాలను సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి ఇక్కడ మరో 50 వేల జనాభా అదనంగా పెరుగుతుందని, రాజధానికి కొత్తగా వచ్చే వీరందరి కోసం కనీసం 12 వేల ఆవాసాలు అవసరం పడతాయని భావిస్తున్నామని, ఆమేరకు ప్రభుత్వ గృహ వసతి ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని కమిషనర్ చెప్పారు. అదనంగా వచ్చే జనాభా కోసం హోటళ్లు, మాల్స్, విద్యాలయాలు, ఆసుపత్రులు, ఇతర సదుపాయాలను త్వరతిగతిన సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ-ప్రైవేట్ పద్ధతిలో అతి పెద్ద మాల్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, అది వీలు కాని పక్షంలో తామే సొంతంగా మాల్ నిర్మాణాన్ని చేపట్టి తరువాత దాని నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించాలని యోచిస్తున్నామని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. దీంతో పాటు మధ్య, చిన్న తరహా మాల్స్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి ఆయనకు సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్, ముంబై తదితర నగరాలలో ఉన్న కార్పొరేట్ సంస్థల ప్రధాన కార్యాలయాల కోసం తగినంత స్థలాన్ని కేటాయించాలని అభ్యర్ధనలు వస్తున్నాయని, దీనికోసం ప్రత్యేకంగా ఒక పాలసీని తీసుకురావాల్సి వుందని కమిషనర్ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.

పరిపాలన నగరంలో చేపట్టనున్న అన్ని ప్రభుత్వ భవంతుల నిర్మాణాలకు సంబంధించి జూన్ 16 నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని సీఆర్‌డీఏ కమిషనర్ చెప్పారు. సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయ భవంతుల నిర్మాణం నెలాఖరు నాటికి టెండర్ దశను పూర్తిచేసుకుని పునాదుల స్థాయికి చేరుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ ముఖ్యుల బంగ్లాల నిర్మాణం పునాదుల దశలో ఉందన్నారు. పునాదుల నిర్మాణంలో అంతర్జాతీయంగా పేరొందిన ‘కెల్లార్’ వంటి సంస్థలను భాగస్వామ్యుల్ని చేయాలని ముఖ్యమంత్రి ఆయనకు చెప్పారు.

6 ఎల్‌పీఎస్ జోన్లలో చేపట్టిన అండర్ గ్రౌండ్ అభివృద్ధి పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని కమిషనర్ చెప్పారు. ఉండవల్లి, పెనుమాక మినహా మిగిలిన అన్ని గ్రామాలలో లే అవుట్ల అభివృద్ధి పనులు టెండర్ల దశలో ఉన్నాయని తెలిపారు. సీఆర్‌డీఏకు వెలుపల ఉన్న ప్రాంతంలో ప్రధాన రహదారి విస్తరణకు

కొన్ని ఇబ్బందులు వున్నాయని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఉండవల్లి నుంచి తాడేపల్లి వెళ్లే మార్గంలో రహదారి విస్తరణకు ఉన్న ఇబ్బందులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

## అమరావతి నిర్మాణంలో 'ఎల్ఎస్ఈ' భాగస్వామ్యం

అమరావతి నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రఖ్యాత 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' ముందుకొచ్చింది. అమరావతిలో ఇటీవల నిర్వహించిన 'సంతోష నగరాల సదస్సు' దరిమిలా జరిగిన ముఖ్య పరిణామంగా దీనిని భావిస్తున్నట్టు సీఆర్‌డీఏ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' ప్రొఫెసర్లు ప్రస్తుతం 'వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్టు'కు రూపకర్తలుగా ఉన్నారు. ఆర్థిక, రాజనీతి, వాణిజ్య శాస్త్రాలకు సంబంధించి 'ఎల్ఎస్ఈ' ప్రపంచ ప్రఖ్యాతి పొందిన విద్యాసంస్థగా గుర్తింపు పొందింది. ఈ స్కూలులో ముఖ్య విభాగం ఉన్న 'ఎల్ఎస్ఈ సిటీస్' నగర, పట్టణీకరణకు సంబంధించిన అనేక అంశాలపై నిరంతర పరిశోధనలు జరుపుతుంది. అమరావతి అభివృద్ధిలో పాలు పంచుకోవడానికి ఈ స్కూల్ ఆసక్తిగా ప్రదర్శిస్తున్నట్టు సీఆర్‌డీఏ కమిషనర్ ముఖ్యమంత్రికి చెప్పారు. అభివృద్ధి, ఆర్థిక వనరులు, భవిష్యత్ రవాణా వ్యవస్థ తదితర అంశాలపై 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' విద్యార్థులు రెండు నెలల పాటు అధ్యయనం చేయడానికి వస్తున్నట్టు తెలిపారు. అమరావతి అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అక్కడ తమ విద్యార్థులకు లెక్చర్ ఇవ్వడానికి సీఆర్‌డీఏ తరపున నలుగురు ప్రతినిధులకు 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' ఆహ్వానం పంపిందని చెప్పారు. జూన్ 4 నుంచి 8 వరకు వీరక్కడ లెక్చర్లు ఇవ్వనున్నారని తెలిపారు. అలాగే, ఆగస్టులో 'ఎల్ఎస్ఈ సిటీస్' విద్యార్థులు అమరావతి సందర్శిస్తారని, రెండు నెలల పాటు ఇక్కడ అధ్యయనం చేస్తారని వివరించారు.

## వచ్చే నెలలో 'డెవలపర్స్ కాంక్లేవ్'

సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వచ్చే నెల మొదటివారంలో అమరావతిలో 'రియలెస్టేట్ డెవలపర్స్ కాంక్లేవ్' జరగనున్నది. ఈ సదస్సులో పలు, జాతీయ, అంతర్జాతీయ రియలెస్టేట్ సంస్థలు పాల్గొంటున్నట్టు సీఆర్డీయే కమిషనర్ చెప్పారు. డీఎల్ఎఫ్, ఆర్ఎంజెడ్, మైహోమ్, మహీంద్రా లైఫ్ స్పేసెస్, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్, సాలార్‌పురియా సత్వా, దివ్యశ్రీ, షాపూర్జీ, పల్లోంజీ తదితర సంస్థలు ఈ కాంక్లేవ్‌లో పాల్గొంటున్నట్టు సమాచారం ఇచ్చాయని తెలిపారు.

## నేరుగా వస్తా... అభివృద్ధి చూస్తా...

అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఆధ్వర్యంలో జరుగుతున్న నర్సరీ, రహదారి అభివృద్ధి పనుల పురోగతిని శనివారం ఉదయం తాను ప్రత్యక్షంగా పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. తనతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర ప్రభుత్వ ముఖ్యులు ఈ పర్యటనలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఏడీసీ సీఎండీ శ్రీమతి లక్ష్మీ పార్థసారథి అభ్యర్థన మేరకు కొత్త నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించడానికి ఆయన అంగీకరించారు. హైదరాబాదులో పదే పదే క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి అధికారులను పరుగులు పెట్టించేవారని, అలాగే, ఇక్కడ కూడా జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించడానికి రావాలని లక్ష్మీ పార్థసారథి ముఖ్యమంత్రిని కోరారు.

విజయవాడ నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారి మార్గానికి ఇరువైపులా అందమైన పుష్పజాతులకు చెందిన చెట్లను పెంచాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అమరావతి అభివృద్ధి సంస్థ అధికారులకు సూచించారు. సీఆర్‌డీఏ పరిధిలో అర ఎకరం నుంచి 60 ఎకరాల విస్తీర్ణం వరకు ఉన్న మొత్తం 69 ఉద్యాన వనాలను పచ్చదనంతో ఆకర్షణీయంగా రూపొందించాలని ఆదేశించారు. ఈ ఉద్యాన వనాలలో యోగా, జిమ్ తదితర సదుపాయాలను కల్పించాలని చెప్పారు. ప్రతి ఉద్యాన వనంలో సామాన్యులు ప్రకృతిని ఆస్వాదిస్తూ యోగా, కసరత్తులు చేసే సదుపాయాలు ఉండాలే చూడాలని సూచించారు. ఈ సీజన్‌లో విజయవాడ పరిధిలోని 30 కిలోమీటర్ల పొడవున ఉన్న కాలువల సుందరీకరణ పనులను పూర్తిచేయాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఈ పనులలో జాప్యం వుండరాదని తేల్చారు. సీఆర్‌డీఏ పరిధిలోని అటవీ భూములలో పచ్చదనం పెంచాలని, రాజధాని పరిధిలో ప్రత్యేకంగా డీఎఫ్ఓను నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు.

రాజధానిలో 10 వేల హోటల్ గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద లక్ష గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, కొత్త రాజధానిలో ఈ ప్రక్రియ మరింత వేగవంతంగా జరపాల్సి వుందని అన్నారు. కొత్త నగరంలో 1800 హోటల్ గదుల ఏర్పాటుకు ఆయా సంస్థలు లెటర్ ఆఫ్ ఇంటెంట్ ఇచ్చాయని అధికారులు ముఖ్యమంత్రికి చెప్పారు.

## ఇంటికో ఎంటర్‌ప్రెన్యూర్..

రాజధాని ప్రాంత రైతులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయూత అందిస్తామని ప్రకటించామని, దానికి తగినట్టుగా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి సీఆర్‌డీఏ కమిషనరుకు సూచించారు. రైతుల్ని ఎంటర్‌ప్రెన్యూర్లుగా రూపొందించే కార్యక్రమం కోసం ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 30 వేల కుటుంబాల్లో ప్రతి రైతు కుటుంబానికి ఆర్థికంగా చేయూతనివ్వాలన్నదే తన ధ్యేయమని చెప్పారు. రైతు కుటుంబాల కోసం నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ప్రతి కుటుంబంలో విద్యార్హతలు, ఇతర సమాచారాన్ని క్రోడీకరించి దాని ఆధారంగా వారికి అవసరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి వ్యాపార, వాణిజ్య అవకాశాలు కల్పించాలని సూచించారు. దీనిపై తక్షణం సీఆర్‌డీఏ దృష్టి పెట్టాలని చెప్పారు. నేలపాడు, శాఖమూరు గ్రామాలను దీనికోసం నమూనా గ్రామాలుగా తీసుకుంటున్నట్టు సమావేశంలో కమిషనర్ చెప్పారు.